


## గంగమ్మ ఆలయంలో పురావస్తుశాఖ పరిశీలన



తిరుపతి, మార్చి 5(ప్రభాతవార్త):
తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆలయ పునర్నిర్మాణ పనుల్లో రాతిస్తంభం బయటపడింది. ఇది పల్లవుల కాలంనాటి నిర్మాణం జరిగిందని పురావస్తుశాఖ సెంట్రల్ డైరెక్టర్ శ్రీలక్ష్మి, సత్యం ఆదివారం ఉదయం పరిశీలించారు. దీని ఉపయోగం, పటిష్టతపై నివేదిక అంద జేయనున్నారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, నగర మేయర్ డాక్టర్ ఆర్.శిరీష, ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఆలయ ఇఒ ఎం.మునికృష్ణయ్య పాల్గొన్నారు.

**-ఆలయపునర్నిర్మాణానికి రూ.లక్ష విరాళం**

గంగమ్మ ఆలయంలో జరుగుతున్న అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులకు తిరుపతికి చెందిన హైమావతి, మల్లికార్జున 1,00,800 రూపాయలు విరాళం అందజేశారు.

## గంగమ్మ దర్శనానికి క్యూకట్టిన భక్తజనకోటి



బోయకొండ(చౌడేపల్లి), మార్చి 5 ప్రభాతవార్త
శక్తిక్షేత్రం బోయకొండపై భక్తుల రద్దీ పెరిగింది. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో యాత్రీకులు తరలిరావడంతో అమ్మవారి కొండ భక్తజనసంద్రమైంది. ఈసందర్భంగా ఆల యంలో అర్చకులు, వేదపండితులు వేకువజామునే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో రద్దీగా కనిపించాయి. విశేష సంఖ్యలో వచ్చిన యాత్రీకులకు ఆయల ఛేర్మన్ మిద్దింటి శంకరానారాయణ, ఇఓ చంద్రమౌళి, అధికార, సిబ్బంది సేవలందించారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీపై వైకాపా ఆశలు ఆవిరి!

## - వరుసగా నాల్గవసారి గెలుపే లక్ష్యంగా పిడిఎఫ్ అడుగులు

చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త:
ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో వున్నారని విస్తృతంగా ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు అధికార వైకాపాకు సవాల్‌గా నిలిచాయి. రాష్ట్రంలో 2007 సంవత్సరంలో శాసనమండలి పునరుద్దరణ జరిగినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంను వామపక్ష పార్టీల మద్దతుతో వరుసగా మూడుసార్లు కైవసం చేసుకొని పిడిఎఫ్ అభ్యర్థులు హ్యాట్రిక్ సాధించారు. మళ్ళీ ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీలో మరోమారు తమ అభ్యర్థిని గెలిపించడానికి వామపక్ష పార్టీల మద్దతుతో పిడిఎఫ్ గెలుపుకోసం పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది. తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పిడిఎఫ్‌కు ఇప్పటికే గట్టి పట్టు వుండటంతో ఈ ఎన్నికలను అంతగా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాల్సిన అవసరం లేదని అధికార వైకాపా భావించింది. ప్రభుత్వంపై ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు అసంతృప్తిగా వుండటంతో, మరోవైపు ఈ నియోజకవర్గంలో వరుసగా మూడుసార్లు పిడిఎఫ్ తరపున పోటీ చేసిన అభ్యర్థులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా ఎన్నికల అవుతుండటంతో అధికార వైకాపా ఈ స్థానంను లైట్‌గా తీసుకొంది. అయినప్పటికీ అధికారంలో వుండి పోటీ చేయకుంటే ప్రతిపక్ష పార్టీల నుండి విమర్శలు వస్తాయనే భావించిన వైకాపా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం నుండి పోటీ చేయడానికి నామినేషన్ దాఖలు చేసిన పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతు తెలిపింది. మరోవైపు ఇప్పటికే తమ ఖాతాలో వున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంను మరోమారు తమ ఖాతాలో వేసుకోవాలని భావించిన పిడిఎఫ్ తమ అభ్యర్థిగా బాబురెడ్డిని ఎన్నికల బరిలో నిలిపింది. ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అసంతృప్తితో వున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకొంది. పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాబురెడ్డిని జిల్లాలో పట్టువున్న ఉపాధ్యాయ సంఘాలైన యుటిఎఫ్, ఎస్‌టిఎఫ్, డిటిఎఫ్, కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం, డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం మద్దతు పలుకుతు న్నాయి. ఈ సంఘాల్లోనే అత్యధిక ఉపాధ్యాయులు వుండటంతో ఈ సారిసైతం అత్యధిక ఓట్లతో తమ రికార్డులను తామే తిరుగరాస్తామని పిడిఎఫ్ అభ్యర్థి ధీమా వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో 2007 సంవత్సరంలో శాసన మండలి ఏర్పాటు అయితే అప్పుడు పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా విఠపు బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా రామిరెడ్డిలు పోటీ చేసి విజయం సాధించారు. ఆపై 2011, 2017 సంవత్సరాల్లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా విఠపు బాలసుబ్రమణ్యం పోటీ చేసి విజయం సాధించారు. ఈ స్థానం నుండి గతంలో జరిగిన మూడు ఎమ్మెల్సీ ఎన్నికల్లోను పిడిఎఫ్ అభ్యర్థులు విజయం సాధించారు. ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బాబురెడ్డిని ఖరారు చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మొత్తం 8 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో మిగిలితే అందులో పిడిఎఫ్ అభ్యర్థి బాబురెడ్డి ఇతర అభ్యర్థులకంటే అగ్రస్థానంలో నిలిచారు. మరోవైపు అధికార వైకాపా పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి మద్దతు తెలపడంతో ఆ మేరకు క్షేత్ర స్థాయిలో వైకాపా ఎమ్మెల్యేలు, నాయకులు ఉపాధ్యాయ ఓట్ల కోసం అభ్యర్థిస్తున్నారు. తూర్పు రాయలసీమ ప్రకాశం-నెల్లూరు-చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానం పరిధిలో మొత్తం 27,694 ఓట్లు వున్నాయి. ఇందులో చిత్తూరు జిల్లా పరిధిలో 3,887 ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు వుండగా 2,341 పురుష ఓటర్లు, 1,546 మహిళా ఓటర్లు వున్నారు. అలాగే తిరుపతి జిల్లా పరిధిలో మొత్తం 6,132 ఉపాధ్యాయ ఓట్లు వుంటే అందులో 3,604 పురుష ఓట్లు, 2,528 మహిళా ఓట్లు వున్నాయి. అలాగే అన్నమయ్య జిల్లా పరిధిలో మొత్తం 1,932 ఓట్లు వుంటే అందులో 1,180 పురుష ఓట్లు, 752 మహిళ ఓట్లు వున్నాయి. అలాగే బాపట్ల జిల్లా పరిధిలో మొత్తం 1,789 ఓట్లు వుంటే అందులో 1,094 పురుష ఓటర్లు, 695 మహిళా ఓట్లు వున్నాయి. అలాగే ప్రకాశం జిల్లా పరిధిలో 5,789 ఓట్లు వుంటే అందులో 3,691 పురుష ఓట్లు, 2,098 మహిళ ఓట్లు వున్నాయి. అలాగే నెల్లూరు జిల్లా పరిధిలో మొత్తం 8,165 ఓట్లు వుండగా ఇందులో 4,915 పురుష ఓట్లు, 3,250 మహిళా ఓట్లు వున్నాయి. ఈ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఓట్లను ప్రభావితం చేయడానికి పెద్దగా అవకాశం లేకపోవడంతో రాజకీయ పార్టీలు ఈ స్థానంపై ఇప్పటికే గెలుపుపై ఆశలు వదులుకొన్నట్లు తెలిసింది. తమకు అవకాశం వున్న చోట్ల కొంతమంది ఉపాధ్యాయులను ప్రభావితం చేసి తమకు అను కూలంగా ఓట్లు వేయించుకోవాలని అధికార వైకాపా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నప్పటికీ ఈ విషయంపై ఎంత మేరకు విజయం సాధిస్తుందనే విషయంపై నమ్మకం లేదు. ఈ పరిస్థితుల్లో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు ప్రస్తుతం జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంను కైవసం చేసుకోవడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది.

### కాణిపాకంలో

## 'ఉదయాస్తమయ సేవ' ప్రారంభం



గోపూజ చేస్తున్న శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, ఉదయాస్తమయసేవ టిక్కెట్‌లను భక్తులకు అందజేస్తున్న స్వామీజీలు

కాణిపాకం, మార్చి 5 ప్రభాతవార్త:
సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీస్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో టీటీడీ తరహాలో నూనతంగా ప్రవేశపెట్టిన 'ఉదయాస్తమయ సేవ' ఆర్జిత సేవను ఆదివారం విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాములు ప్రారంభించారు. లక్ష రూపాయల టిక్కెట్ ధరతో టీటీడీ తరహాలో ప్రధాన ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు జరిగే 13 రకాల ఆర్జిత సేవల్లో పాల్గొనే అవకాశం భక్తులకు కల్పిస్తూ ఉదయమాస్తమయ సేవను దేవస్థానం ప్రవేశపెట్టింది. ఈసేవను లక్షమోదక లక్ష్మీ గణపతి హవనము మహాయజ్ఞం కార్యక్రమం చివరి రోజు ఆదివారం శారదా పీఠాధిపతులు ప్రారంభించారు. ఈమేరకు ఆదివారం వేకువజామున 4 గంటలకు బిందెతీర్థము, గోపూజ పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామీజీలు లాంచనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా పూతలపట్టు మండలం పాలకూరుకు చెందిన జీవరత న్నంరెడ్డి, తిరుపతికి చెందిన రామచంద్రారెడ్డిలు మొట్టమొదటిగా టిక్కెట్‌లను కొనుగోలు చేసి ఆర్జితసేవలో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**పీఆర్ఓ, విచారణ కేంద్రంను ప్రారంభించిన స్వామీజీలు**

కాణిపాకం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన పీఆర్ఓ, విచారణ కేంద్రం కార్యాలయంలను ఆదివారం విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీస్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాములు ప్రారంభించారు. ఆలయ ముందు భాగంలో భక్తుల సౌకర్యార్థం దేవస్థానం నూతనంగా పీఆర్ఓ, విచారణ కేంద్ర కార్యాలయంను ఏర్పాటు చేసిన ఈకార్యాలయంను స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి ప్రారంభించారు.

**స్వామీజీలకు ఘన సత్కారం**

దేవస్థానంలో మూడు రోజుల పాటు జరిగిన లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము మహాయజ్ఞంను దిగ్విజయంగా నిర్వహించిన విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీస్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాములను దేవస్థానం తరపున ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు స్వామీజీలను ఘనంగా సత్కరించి స్వామివారి తీర్థ, ప్రసాదాలను స్వామివారి చిత్రపటాలను అందజేశారు. ఈకార్యక్రమంలో చిత్తూరుఎంపీలు రెడ్డెప్ప, పూతలపట్టు, ఎమ్మెల్యే ఎమ్మెస్ బాబు, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ అంజూరి తారక శ్రీనివాసులు, కాణిపాకం ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఆలయ ఉప ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## చూడరమ్మ...చక్కనైన ఇలవేల్పు వయ్యారం!

### ఉభయదేవేరులతో మలయప్ప జలవిహారం

తిరుమల, మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:
ఏడుకొండలపై పవిత్ర పుష్కరిణిలో శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న సాలకట్ల వార్షిక తెప్పోత్సవాల్లో మూడవరోజు ఆదివారం రాత్రి ఉభ యనాంచారులతో కలసి శ్రీమల యప్పస్వామి వయ్యారంగా విహరిం చారు. తనను చేరి కొలిచిన వారికి ఈకలియుగంలో అడుగడుగునా కాపాడతానని అభయమిస్తూ శ్రీదేవిభూదేవి సమేతుడై తెప్పపై పుష్కరిణిలో విహరించారు.





## గంజాయి పట్టివేత

### పట్టుబడిన యువకులు రిమాండ్‌కు..



తిరుపతిరూరల్, మార్చి5 ప్రభాతవార్త:
తిరుపతి నగరములో గంజాయి విక్రయిస్తున్న ముఠాను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఇబి అధికారులకు అందిన సమా చారం మేరకు చెన్నారెడ్డి కాలనీలో గంజాయి విక్రయి స్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, వారి నుండి 1.250 కేజీల గంజాయి తో పాటు ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసిన ఎం.ప్రదీప్, బి.తేజ, టి.మహేష్ లను విచారించి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ నాగరాజారెడ్డి మాట్లాడుతూ యువకులు చెడు వ్యసనాలకు లోను కావద్దని సూచించారు. నగరములో గంజాయి నిషేధాన్నికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇబి సబ్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, పోలీసులు పాల్గొన్నారు.

## కొమరగుంటలో అంబరాన్ని అంటిన సంబరాలు



గిత్తను నిలువరించడంకు ప్రయత్నిస్తున్న యువకులు

వెదురుకుప్పం, మార్చి 5 ప్రభాతవార్త :
కొమరగుంటలో ఆదివారం కొడెగిత్తలు అల్లి వద్ద కాలు దువ్వడంతో .... యువకులు రెట్టించిన ఉత్సాహంతో చెక్క పట్టీల కోసం పౌరుషంతో బరిలోకి దిగి పోటా పోటీగా కుస్తీకి దిగడంతో పశువుల సంబరాలు అంబరాన్ని అంటాయి. మండలంలోని కొమరగుంటలో శ్రీపద్మావతి అండాల్ సమేత వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహోత్సవాలు పురష్కరించుకుని పశువుల పండుగ నిర్వహించారు. యువకులు గ్రామాన్ని రంగు పేపర్ల, మామిడి తోరణాలతో ప్రత్యేక అలంకరించి పశువుల పండుగకు అందగా ముస్తాబు చేశారు. రైతులు గిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి ఇష్టమైన దేవుళ్ళు, సినిమా హీరోల ఫోటోలు ఉన్న చెక్క పట్టీలు, టవళ్ళు, బెలూన్స్‌తో ప్రత్యేకంగా అలంకరించి బరిలోకి దించడంతో యువకులు రెట్టించిన ఉత్సాహంతో అల్లివద్ద పోటా పోటీగా కుస్తీకి దిగారు. దీంతో గ్రామంలో ఒక్కసారిగా పండుగ వాతావారణం నెలకుంది. చెదురు మదురు సంఘటలు మినహా అద్యంతం పోటీలు రవవత్తంగా మారాయి. ఓ గిత్త కుస్తీకి దించిన తరువాత ఓ వ్యవసాయ బావిలో పడిపోయింది. జనం పెద్ద సంఖ్యలో గిత్తను రకిక్షంచడంకు బావి వద్దకు చేరుకుని ప్రయత్నాలు చేశారు. ప్రశాంత వాతావరణంలో పండుగా నిర్వహించుకున్నారు.



వ్యవసాయ బావి వద్ద గిత్తను రక్షించడంకు చేరిన జనం.

### ఉష్ణోగ్రతలు

5/3/2023



- తిరుపతి 34 డిగ్రీలు
- చిత్తూరు 35 డిగ్రీలు
- మదనపల్లి 27 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 34 డిగ్రీలు
- వెంకటగిరి 34 డిగ్రీలు
- గూడూరు 35 డిగ్రీలు

### బంగారం ధరలు

5/3/2023



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 5,251

24క్యారెట్స్ 1గ్రాము రూ.5,728

### కోడిగ్రుడ్ల ధరలు

5/3/2023



కోడిగ్రుడ్డు :రూ.5.50

1 డజను: రూ.66.00

## శ్రీసిటీకి రూ॥7,075 కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు-ప్రారంభోత్సవాలు



సత్యవేడు, మార్చి 5,ప్రభాతవార్త:
విశాఖలో జరిగిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వేస్టర్స్ సమ్మిట్ 2023లో శ్రీసిటీకి సంబంధించి రూ॥7,075 కోట్లు విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు, వర్చువల్ ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇందులో ఇప్పటికే ఉన్న 14 పరిశ్రమల ప్లాంట్ విస్తరణ కాగా, 5 కొత్త పరిశ్రమల ప్రతిపాదనలు ఉన్నాయి. విశాఖ పెట్టుబడుల సదస్సు వేదిక నుంచి కేంద్రపర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 14 పరిశ్రమలను వర్చువల్‌గా ప్రారంభించగా, అందులో శ్రీసిటీకి చెందినవి ఏడు ఉన్నాయి. రాష్ట్ర ఇంధనం, అటవీ, పర్యావరణం, సైన్స్, టెక్నాలజీ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమరనాథ్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ సృజన, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, ఇతర ప్రముఖులు పెట్టుబడి ఒప్పంద పత్రాల మార్పిడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎంఓయూలపై డాక్టర్ రవీంద్రసన్నారెడ్డి స్పంది స్తూ చురుకైన విధానాలతో రాష్ట్రంలో బలమైన పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు.

# శ్రీకాళహస్తీశ్వరాలయంలో పోటెత్తిన భక్త జనం

## రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలు



శ్రీకాళహస్తి, మార్చి5 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. కాగా సోమవారం పౌర్ణమి కావటంతో ఆదివారం పొరుగు ంష్ట్రాల నుంచి భక్తులు తండోపతండాలుగా కదలి వస్తున్నారు. చలి తగ్గుతుంది. వేడి పెరుగుతుంది. ఎండలు దడపుట్టిస్తున్నాయి. అయితే భక్తులు మాత్రం కడలి తరంగాల్లా కదలి వస్తున్నారు. అయితే దర్శనాలకు వచ్చిన సామాన్య జనం తిప్పలు వర్ణనాతీతంగా మారింది. శనివారం రాత్రి నుంచి వరదలా జనం తరలి వచ్చారు. పట్టణంలోని నాలుగుమాడావీధుల్లోని అతిథి గృహాలు నిండాయి. బస అవకాశం లేక ఇబ్బందులు పడ్డారు. ఆలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకొని బాధల నుంచి విముక్తి పొందటానికి ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఈ పూజలు జరిపించుకున్న భక్తులు దర్శనాలకు తిప్పలు పడ్డారు.

**రోజుకో విధానం . . .**

ఆలయంలో అధికారులు రోజు కోక విధానం అమలు చేస్తున్నారు. దాంతో ఎవరు ఎటు వెళ్ళాలో దర్శనాలకు అవకాశం మెంతో తెలియని స్థితి చోటు చేసుకుంది. ఇక ఆలయంలోపలకు వెళ్ళటానికి ఏర్పాటు చేసిన గేట్లునుంచి ఎవరు ఎటు వెళుతున్నారు.అంతుచిక్కని ప్రశ్న. ఎవరు విఐపిలో ఎవరు సామాన్య భక్తులో తెలియలేదు. దాంతో దళారుల దందా విచ్చల విడిగా సాగింది. గేట్ల నుంచి దళారులు తాము ఒప్పందం చేసుకున్న వారిని తీసుకెళుతుంటే సామాన్య భక్తులు పెదవి విరిచారు. ఇదే అదునుగా క్యూలైన్లలో సామాన్యభక్తుల రాకను ఆపి విఐపిలంటూ తీసుకెళ్ళటం ఆశ్చర్యపరచింది, భక్తుల్లో అసహనం పెరిగి క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న సిబ్బందిపై తిరగబడుతున్నారు. 'దేవుని దర్శనాలకు సిఫార్సులా?' అంటూ నిలదీస్తున్నారు. అయితే విఐపిల ముసుగులో తమ దందాను సాగించుకుంటున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంస్కరణలు ప్రవేశ పెడుతున్నారు. కానీ పర్యవేక్షించే దిక్కు కరువయ్యారు. దాంతో సంస్కరణలు కేవలం ఫైళ్లకే పరిమితమౌతున్నాయి.ఇక్కడ ప్రోటోకాల్ దర్శనాల పేరిట సాగుతున్న దర్శనాలపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

**ఇఓ వచ్చినపుడు పారదర్శకత:**

ఆలయంలో పని చేస్తున్న సిబ్బందికి లాడ్జిల్లో పని చేసే వారికి అవగాహన కుదుర్చుకొని ప్యాకేజిలు అమలు చేస్తున్నారు. శనివారం రాత్రి వచ్చే భక్తులకు గదులు ఇప్పించినపుడే ఒప్పందం కుదుర్చు కుంటారు. లాడ్జి రేటుతో పాటు ఆలయంలో ప్రత్యేక, సత్వర దర్శనాలకు ప్యాకేజిలు ఖరారు చేసుకుంటారు. ఉదయం దళారి నుంచి ఫోన్ దర్శనాలకు రాచబాటగా మారింది. అయితే తమ ఒప్పందాలు బయట పడకుండా పరిశీలనకు అధికారులు వచ్చే సమయంలో మాత్రం ఎక్కడ లేని నిబంధనలంటూ అమలు చేస్తున్నారు. ఎంత కట్టుబాటు అంటే ఇఓ ఆలయంలో పర్యవేక్షించే సమయంలో మాత్రం తన సిబ్బంది ఇంత పారదర్శకత్వుతో పని చేస్తున్నారా? అని ఆశ్చర్యపోయలా నటిస్తున్నారు.ప్రకటనల్లో మాత్రం సామాన్యభక్తుల దర్శనాలకు పెద్ద పీట. ఆచరణలో అంతా పలుకుబడి మయం చేస్తున్నారు.

**30వేల మంది దర్శనం**

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి సుమారు 30వేల మందిభక్తులు దర్శించుకున్నట్లు సాయంత్రం విడుదల చేసిన సమాచారంలో ఆలయాధికారులు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో రాహుకేతుదోష నివారణ పూజలఉర 5190 మంది పూజలు జరిపించుకున్నట్లు ప్రకటించారు.ఉదయం నుంచి 30వేల మంది దర్శించుకున్నట్లు ప్రకటించారు.

# ఏపి జూడో అసోసియేషన్ అత్యవసర సమావేశం

తిరుపతి (క్రీడ), మార్చి 5, ప్రభాతవార్త

ఆనం రామకిషోర్ రెడ్డి ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేసారు. ప్రస్తుతం యాక్టింగ్ సుబ్బారావు అంటూ నామిశెట్టి పవన్ సందీప్ దొంగపత్రాలు సృష్టించి హైకోర్టు నందు కేస్ వేసి 1343/2023 ఇంటీరియం ఆర్డర్ తీసుకొన్నారు. దానిని సవాలు చేస్తూ ఆనం రామ కిషోర్ రెడ్డి హైకోర్టుని ఆశ్రయిస్తూ కేస్ 3355/2023 వెయ్యడం జరిగింది. వాదోపవాదాలు విన్న హైకోర్టు రాజీనామా చేసినట్టు చూపించిన పత్రాలు అనైతికంగాను సొసైటీ యాక్ట్ నియమాలకు వ్యతిరేకంగాను ఉన్నాయంటూ నమసెట్టి పవణ్ సందీప్, సుబ్బారావులు తీసుకొన్న ఇంటీరియం ఆర్డర్‌ను ఫిబ్రవరి 22న కొట్టి వేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం అధ్యక్షులు ఆనంరామకిషోర్ రెడ్డి అత్యవసర సర్వ సభ్య సమావేశం




ఆదివారం హోటెల్ సింహపురి, నెల్లూరు నందు నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపి జూడో సంఘం కార్యదర్శి బి. శ్రీధర్, కోశాధికారి కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాంబాబు, సియిఓ కె.ఎన్ బాబులు అధ్యక్షులు కిశోర్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ఒలంపిక్ సంఘం గుర్తింపు కలిగిన ఆనంరామకిషోర్ రెడ్డి, శ్రీధర్, కిరణ్ కుమార్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న సంఘమే అసలైన ఆంధ్రప్రదేశ్ జూడో సంఘం అని, మరెవరికీ ఏ విధమయిన హక్కులు లేవని సంఘ అధ్యక్షులు ఆనంరామకిషోర్ రెడ్డి తెలియజేయడం జరిగింది. 52 లక్షల ఆర్థిక నేరాలకు పాల్పడిన వెంకట్ నామిశెట్టి, రాజమండ్రి చీఫ్ కోచ్ డిఎంఎం శేషగిరిల మీద క్రిమినల్ కేస్ పెట్టాలని, అలాగే సంఘం వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కృష్ణా, విశాఖ పట్నం, తూర్పు గోదావరి, ప్రకాశం, పశ్చిమ గోదావరి జిల్లాల ప్రతినిధులను తొలగిస్తూ, ఈ జిల్లాలకు తాత్కాలిక కమిటీలను నియమించడం జరిగింది.

## ఊరందూరులో మాతమ్మ ఆలయానికి భూమి పూజ

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామ అరుంధతి వాడలో ఆదివారం మాతమ్మ ఆలయానికి భూమి పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి సర్పంచ్‌గా ఎంతో అభివృద్ధి చేసిన సర్పంచ్ బొల్లినేజి జగన్నాధం నాయుడు రాబోవు ఎన్నికల్లో శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయటానికి నిర్ణయించారు. ఏ రాజకీయ పార్టీ నీడ దొరక్కునా ఇండిపెండెంట్‌గా పోటీ చేయటానికి సిద్ధ పడ్డారు. ఈనేపధ్యంలో ఇటీవల కాలంలో ఆయన గ్రామ గ్రామాలకు వెళ్ళి ప్రచారం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆయన సామాజిక కార్యక్రమాల్లో ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. ఆదివారం ఊరందూరు గ్రామానికి చెందిన అరుంధతి వాడలో మాతమ్మ ఆలయం నిర్మాణానికి భూమి పూజలు ఏర్పాటు చేసారు. బొల్లినేని జగన్నాధం నాయుడుకు వాడ వాసులు ఘనస్వాగతం పలికారు. భూమి పూజలు చేసిన ఆయన ఆలయ నిర్మాణానికి తమ సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.

## అంచనాలకు మించి భక్త జనం: క్యూలైన్లను పరిశీలిస్తున్న ఇఓ

శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఆదివారం అంచనాలకు మించి భక్తులు హాజరయ్యారు. రాహుకాల సమయంలో భక్తులు ఇబ్బందులు ఎదర్కొనకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఆలయ ఇఓ వికె సాగర్‌బాబు వ్యక్తిగతంగా ఇక్కడ క్యూలైన్లను పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటల నుంచి క్యూలైన్లు నిండిపోయాయి. ముఖ్యంగా రూ.500లు, రూ.,750ల పూజా టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులు రాహుకాలంలో పూజలు జరిపించుకొనుటకు క్యూలైన్లలో చేరారు. దాంతో వృద్ధులు, పసిబిడ్డలు ఇబ్బంది పడకుండా ఇఓ సాగర్‌బాబుపర్యవేక్షించారు. క్యూలైన్లలో భక్తులకు ఎవ్వరు ఏమి అడిగినా ఇవ్వరాదని భక్తులను చైతన్యవంతుల్ని చేసారు. అంతేకాక రాహుకేతుదోష నివారణ పూజలు నిర్వహించే మండపాలు ఆకస్మికంగా తనిఖీ చేసారు. అలాగే కంచుగడప, స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనాలను పరిశీలించారు. దాంతో సిబ్బందిలో ఉత్సాహం చోటు చేసుకుంది.

## రామాపురంలో రోడ్డు భద్రతా ఉత్సవాలు:

శ్రీకాళహస్తిరూరల్, మార్చి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామంలో ఆదివారం రోడ్డు భద్రతా ఉత్సవాలను రూరల్‌సిఐ అజయ్‌కుమార్ సారధ్యంలో నిర్వహించారు. గత కొన్ని రోజులుగా రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించాలని ప్రణాళిక రూపొందించుకున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని రామాపురం గ్రామంలో వారోత్సవాల్లో భాగంగా రోడ్డుపై వాహనాలు నడిపే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ హెడ్ కానిస్టేబుల్ హేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కార్పొరేట్ వైద్యశిబిరాలు అభినందనీయం

తొట్టంబేడు, మార్చి 5 ప్రభాతవార్త



గ్రామాల్లో కార్పొరేట్ వైద్యశిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయం మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు, ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరుమయూర్‌లు అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్, ఎంజి ఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో సంయుక్తం గా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని మండల వైకాపా సీనియర్ నాయకులు ఉన్నంవాసుదేవనాయుడు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కార్పొరేట్ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలు అందించడం ఎంతో అభినందనీయం అని ఈశిబిరాలు నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఎంజిఎం వైద్యులు వారికి ఆరోగ్య సలహాలు, సూచనలు అందించారు. వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందించారు. గ్రామాల్లో ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఎంజిఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరుమయూర్ మాట్లాడుతూ తమ ఆస్పత్రి ద్వారా వైద్యసేవలు అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ సక్కుబాయమ్మ, మణి ఎంజిఎం వైద్యులు డాక్టర్‌వివేక్‌చైతన్య, దిలీప్, పవన్, అభిషేక్, సిబ్బంది చరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

## సర్వసంపత్ ప్రదేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష కాలాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త

పట్టణంలోని పానగల్‌రోడ్డులో వెలసి ఉన్న అతిపురాతనమైన శివాలయం సర్వసంపత్ ప్రదేశ్వరస్వామి



ఆలయంలో శని త్రయోదశి పురస్కరించుకుని స్వామివారికి ప్రదోష అభిషేకాలు ఆలయ పూజారి కుమారస్వామి కన్నులపండువగా నిర్వహించారు. టిటిడి ధర్మ ప్రచార పరిషత్ పోతులరాజ్‌కుమార్ హరిద్వార్ నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెప్పించిన పంచముఖ రుద్రాక్షలు స్వామివారి పూజా కార్యక్రమాలలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో వెలసిన నందీశ్వరుని విగ్రహానికి, ఆలయంలో వెలసిన స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి విశేష అలంకరణ చేపట్టారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రప్ప, ఆనందరెడ్డి, సుధాకర్, వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యానాదులు అంటే చిన్న చూపా - పుణ్యమూర్తి

రేణిగుంట, మార్చి 5 ప్రభాతవార్త:



యానాదులు అంఏ అగ్రవర్ణాలకు చిన్న చూపా అంటూ ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింత మాకుల పుణ్యమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. రేణిగుంట మండలం ఆర్ మల్లవరం ఎస్టీ కాలనీ యానాదులపై దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద పాత్రికేయులతో పుణ్యమూర్తి మాట్లాడుతూ అంబేద్కర్ ఎన్ని సంస్కరణలు తెచ్చినా ఎస్సీ, ఎస్టీ కులాలపై అగ్రవర్ణాల దాడులు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన మహిళ ధరణి, మరి కొంత మంది యానాదులపై జరిగిన దాడి చాలా దారుణం అన్నారు. ఆధునిక సమాజంలో కొంత మంది అగ్రవర్ణాలు ఎస్సీ, ఎస్టీలకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారన్నారు. దాడి జరిగిన గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, తిరుపతి ఎస్పీలను కలసి బాధితులకు న్యాయం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. ఇలాగే దాడులు కొనసాగితే యానాదులు ఊళ్ళను వదులుకునిఅడవుల్లోకివెళ్లాల్సి నపరిస్థితులుఏర్పడతాయన్నారు. కార్యక్రమంలోదాడిజరిగిన గిరిజనులతో పాటు సంఘం నేతలు కంజాక్షి కుమార్, చంద్రవేలు, ఈశ్వరయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

**దాడి జరిగిన ప్రాంతాన్ని సందర్శించిన సీపీఎం నేతలు**

అగ్రవర్ణాలు గిరిజనులపై దాడి చేసిన దిగువ మల్లవరం ఎస్టీ కాలనీని సీపీఎం అనుబంధ సంస్థలైన గిరిజన సంఘం జిల్లా నాయకులు కె.హరినాథ్, కేవీపీఎస్ మండల కార్యదర్శి సెల్వరాజ్ సందర్శించారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని భరోసా ఇచ్చారు. అగ్రవర్ణాలు చేసిన దాడిని ఖండించారు.

## మార్చి 28న సెల్‌స్ట్రా 23 టెక్నికల్ ఫెస్ట్

తిరుపతి (విద్య), మార్చి 5, ప్రభాతవార్త



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఈ నెల 28, 29 తేదీల్లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సెల్స్ట్రా 23 అనే టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహిస్తోందని తెలిపారు. టెక్ చర్చలు, సైన్స్ కాన్వాస్, ఐడియా ఎక్స్‌పో, ప్రోగ్రామర్స్ ప్యారడైజ్, బగ్ బ్లాస్టర్స్ వంటి వివిధ ఈవెంట్‌లు, ఫెస్ట్‌లో లేటెక్స్ పై వర్క్ షాప్ నిర్వహించబడుతుందన్నారు. ప్రధాన వక్తలుగా వివిధ విశ్వవిద్యాలయాల నుండి ప్రముఖ ప్రొఫెసర్లు విచ్చేయనున్నారు. విజేతలకు ఆసక్తికరమైన బహుమతులు అందజేయనట్లు తెలిపారు. ఈ టెక్ ఫెస్ట్‌కి డైరెక్టర్ సొయిట్ చీఫ్ ప్యాట్రన్‌గా ప్రొఫెసర్ మల్లికార్జున, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ప్రొ. వి. సరిత, విభాగాధిపతి ప్యాట్రన్‌గా డాక్టర్ ఎన్. పద్మజ, సీనియర్ అసిస్టెంట్, కన్వీనర్‌గా ప్రొఫెసర్, కో కన్వీనర్‌గా ఎల్ జయశ్రీ , విద్యార్థి కన్వీనర్‌గా టి. లక్ష్మి లహరి, విద్యార్థి కో కన్వీనర్‌గా వి. దివ్య వ్యవహరించనున్నారు.

## ఎమరాల్డ్స్ టాలెంట్ టెస్ట్‌కు అనుహ్య స్పందన

తిరుపతి (విద్య), మార్చి 5, ప్రభాతవార్త



మార్చి 5వ తేది ఆదివారం ఎమరాల్డ్స్ విద్యాసంస్థలు ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు జరిగిన టాలెంట్ టెస్ట్‌కు అనుహ్య స్పందన వచ్చినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు ఇ. గిరిధర్ రెడ్డి, కె. విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ పరీక్షలో 600 మందికి పైగా పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. టాలెంట్ టెస్ట్‌లో రత్నం హైస్కూల్‌కు చెందిన నాగసుమ మొదటి ర్యాంకు సాధించి 10,000 రూపాయిలు నగదు, గౌతం హైస్కూల్‌కు చెందిన కె. భావన రెండవ ర్యాంకు సాధించి 5000 రూపాయిలు, జెసిఆర్ చైతన్య స్కూల్‌కు చెందిన సి. యశ్వంత్ రెడ్డి మూడవ ర్యాంకు సాధించి మూడు వేల రూపాయిలు నగదు బహుమతులు గెలుచుకున్నారు. బహుమతి ప్రధాన కార్యక్రమంలో డైరెక్టర్లతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్. మునిరత్నం, టి. శ్రీనివాసులు, ఎస్. జానకిరామ్, ఎ. పార్థసారధి, టి. నాదముని పాల్గొన్నారు.

## 7 నుంచి ప్రపంచ ఓన్నెస్‌డే సంబరాలు ఏకంలో ఏర్పాట్లు

వరదయ్యపాళెం, మార్చి 5 ప్రభాతవార్త



శ్రీకాళహస్తికి సుమారు 40కిలో మీటర్ల దూరంలోని అమ్మాభగవాన్ ఆశ్రమం, వన్నెస్ ఆలయంలో ఈ నెల 7 నుంచి రెండు రోజుల పాటు 'ప్రపంచ వన్నెస్‌డే' సంబరాలు చేపట్టినట్లు లోకేష్ దాసాజి ఆదివారం తెలిపారు. ఈ నెల 7 మంగళవారం సాయంత్రం ఆరు గంటల నుంచి 8వ తేది రాత్రి ఒంటి గంట వరకు అమ్మాభగవాన్ దర్శనం ఉంటుందని దాసాజి తెలిపారు. శ్రీకాళహస్తికి సమీపంలో వెలసిన అమ్మాభగవాన్ ఆశ్రమం ఏర్పాటు చేసారు. ఇదో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాలజిల్లుతుంది. కరోనా కాలంలో రెండేళ్ళపాటు ధార్మిక కార్యక్రమాలు చేపట్టలేదు. ఇటీవల కాలంలో ఇక్కడ మళ్ళీ అమ్మాభగవాన్ దర్శనాలు ప్రారంభమయ్యాయి. గత నెల నిర్వహించిన సంబరాల్లో లక్షలాది మంది హాజరయ్యా రు. దీక్షలు స్వీకరించారు. దేశవిదేశాలనుంచివేలాదిముఖ్యులుహాజరై దీక్ష తీసుకున్నారు. పూర్వ వైభవం తీసుకువచ్చారు.

**ప్రపంచ వన్నెస్ డే సంబరాలు:** అమ్మాభగవాన్ ఆలయంలో ఈ నెల 7న 'ప్రపంచ ఒన్నెస్ డే' సంబరాలను నిర్వహించనున్నట్లు లోకేష్‌దాసాజివివరించారు. ఇక్కడ రెండు రోజుల పాటు వేలాది మంది అతిధులు హాజరౌతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మాభగవాన్ దర్శనం నిరాటంకంగా సాగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రీతాజి, శ్రీకృష్ణాజీలు దీక్షలు తీసుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా మెడిటేషన్ వచ్చిన వారు సంబరాలు జరుపుకొనుటకు ఏర్పాటు చేసారని వివరించారు. ఇదో సంబరాలుగా ఏర్పాటుచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలకు జిల్లాలోని ఇద్దరు మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా తెలంగాణ నుంచి ఈటెల రాజేంద్ర, చత్తీస్‌గడ్ డెప్యూటీ స్పీకర్ వస్తున్నట్లు సమాచారం. అలాగే శాసనసభ్యులు బియ్యపుమధుసూధనరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తస్యవేదు శాసనసభ్యుడు ఆదిమూలం ఎంపి గురుమూర్తి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి తదితరులు హాజరౌతున్నట్లు లోకేష్‌దాసాజి తెలిపారు.

## శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుడు కామధేను వాహనంలో

పుత్తూరురూరల్, మార్చి 5 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీవల్లి దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం స్వామి, అమ్మవార్లను కామధేను వాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలకు కూడా మహాభిషేకాలు ప్రత్యేక అభిషేకాలు, ఆలయ ప్రదక్షిణం కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, ఉభయ దాతగా ఆదిమాన్ గోత్రం వారు ఆధ్వర్యంలో అలాగే రాత్రి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉభయ దాతగా పుత్తూరు చిదా స్పిన్నింగ్ మిల్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వంశపార్యం పర్య ధర్మకర్త ఎం.సుందరం, ఆలయ అర్చకులు ఎస్.రవిచంద్రన్ గురుకుల్, ఆర్.శరవణన్ తదితరులు పాల్గొన్నారు. సోమవారం భూత వాహనంలో ఊరేగింపు మధ్యాహ్నం అన్నదానం, రాత్రి ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## అహోబిలం లక్ష్మీనరసింహునికి టిటిడి పట్టువస్త్రాలు



తిరుమల, మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:

ఆనవాయితీ ప్రకారం అహోబిలంలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల పురస్కరించుకుని ఆదివారం ఉదయం శ్రీవారి నుంచి పట్టువస్త్రాలు సమ ర్పించారు. ఆలయ పారుపత్తేదార్ ఉమామహేశ్వరరెడ్డి ఆదివారం ఉదయం ఆలయమర్యాలతో అహోబిలం చేరుకుని తలపై పవిత్రంగాపట్టువస్త్రాలుతీసుకెళ్ళిసమర్పించారు. అహోబిలం ఆలయ ప్రధాన అర్చకుడు కెపి వేణుగోపాలకు శ్రీవారి సారెను అందించారు. ఆదివారం సాయంత్రం లక్ష్మీనరసింహుని కల్యాణంలో అలంకరించారు.

## బాలాజీనగర్‌లో హడలెత్తించిన భారీ కొండచిలువ

తిరుమల, మార్చి 5ప్రభాతవార్తప్రతినిధి:



స్థానికులు నివాసముండే బాలాజీనగర్ తూర్పుప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 10అడుగులభారీ కొండచిలువ హడలెత్తించింది. అటవీప్రాంతం నుంచి ఇళ్ళవైపు రావడంతో స్థానికులు సమాచారంతో భాస్కర్‌నాయుడు దాన్ని పట్టి మళ్ళీ అవ్వాచారికోన అడవిలో వదలిపెట్టాడు

# తిరుపతి డివిజన్

## అగ్నిప్రమాదంలో రూ.లక్ష నష్టం

వరదయ్యపాళెం, మార్చి 5 ప్రభాతవార్త



వరదయ్యపాళం మండలంలోని సిఎల్ఎన్ పల్లిలో ఆదివారంజరిగిన అగ్నిప్రమాదంలో రూ.లక్ష ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పంచాయతీలోని హరిజనవాడలకు చెందిన నివాసి సుబ్రమణ్యం, శ్యామలాదేవి ఇంటి పక్కన ఉన్న గడ్డివామి దగ్ధం అయ్యింది. అంతేకాక పక్కనే ఉన్న ఇంటిలోని వస్తువులు ఆగ్నికి ఆహుతయ్యాయి. ఇంట్లో సామగ్రి ఆగ్నికి ఆహుతి కాగా రూ.లక్ష నష్టం వాటిల్లినట్లు సమాచారం. బాధితులను ఆదుకోవాలని పలువురుకోరారు.

## ఉద్యోగులకు క్రీడా పోటీలు

పుత్తూరురూరల్, మార్చి 5 ప్రభాతవార్త:



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ కాలేజీ మైదానంలో పుత్తూరు తపాలా సబ్ డివిజన్ పరిధిలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు శ్రీ నరసింహ ప్రసాద్, పుత్తూరు తపాలా శాఖ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు శక్తి సామర్థ్యాలను వినియోగించుకున్నప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తున్న మహిళలను గౌరవించి, ప్రోత్సహించాలని అన్నారు. పని భారంతో కలిగే ఒత్తిడి నుంచి ఉపశమనాన్ని కలిగించి మానసిక ఉల్లాసం కోసం ఇండిరో ఆటల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళా ఉద్యోగులు చాలా ఉత్సాహంతో పాల్గొన్నారు. ఈ పోటీలు నిర్వహించడానికి ప్రోత్సహించిన తపాలా శాఖ తిరుపతి డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఎండీ జాఫర్ సాధిక్ పాల్గొని మహిళలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పోటీలను పాలమంగళం పీడీ రాజా నిర్వహించారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్యసమావేశం

నూతన కమిటీ అధ్యక్షులుగా శాంతా రెడ్డి, యలమంచలి ప్రవీణ్

చంద్రగిరి, మార్చి 5 ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం శ్రీనివాస మంగాపురంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ ఆర్.శ్రీదర్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి శశికాంత్, నిర్వహణ అధికారులుగా ఎండి తయాబ్, యస్.తేన్మయి వ్యవహరించారు. ఇందులో తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులుగా శాంతా రెడ్డి, యలమంచలి ప్రవీణ్, కార్యదర్శిగా రాగుల శ్రీదర్, కోశాధికారిగా జె.వి.సి.హెచ్.ఎస్.సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఛీఫ్ ప్యాట్రన్‌గా ఈశ్వర్ ప్రకాష్, ప్యాట్రన్‌గా వైఎస్ బాబును కమిటీ నియమించింది. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లాకు చెందిన 23 క్రీడా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'లీడ్' స్కూల్స్‌లో మెరుగైన అభ్యాసన

తిరుపతి ప్రెస్‌క్లబ్ మార్చి 5 ప్రభాతవార్త:

రాష్ట్రంలో లీడ్ పవర్డ్ స్కూల్స్‌లో ప్రస్తు విద్యాసంవత్సరం కోవిడ్ సంభందిత సవాళ్ళు వున్నా సరే సుమారు 20 శాతం విద్యార్థుల అభ్యాసన ప్రక్రియ మెరుగ్గా వుందని లీడ్ కో–ఫౌండర్, సీఈఓ సుమిత్ మెహతా తెలిపారు. ఆదివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ ద్వితీయ శ్రేణి పట్టణాల్లోని స్కూల్స్‌ల్లో మార్కులు సాధించడం ద్వారా నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువస్తూ, దేశంలోని మెట్రోలు, పెద్ద నగరాలకు. పట్టణాల మధ్య వున్న విద్య అంతరాన్ని లీడ్ తగ్గిస్తోందన్నారు. దేశ వ్యాప్తంగా లీడ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్ సిస్టం ద్వారా స్కూల్స్‌కు సాధికారిత అదించడంతో మార్పు తీసుకువచ్చేందుకు తాము కృషి చేస్తున్నామన్నారు. రాబోవు ఐదు సంవత్సరాల్లో 60 వేల స్కూళ్ళలో రెండున్నర కోట్లు మంది విద్యార్థులను చేరుకునే తమ లక్ష్యంలో భాగంగా ఈరాష్ట్రంలో తమ ఉనికిని పెంచుకోవడంపై దృష్టి సారించామన్నారు.

## శిల్పారామంలో హోలీ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

తిరుచానూరు, మార్చి 5 ప్రభాతవార్త:




తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో హోలీ పండుగను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పరిపాలనాధికారి ఖాదర్ వల్లీ తెలిపారు. ఇందులో భాగంగా హోలీ పండుగ పోస్టర్‌లను ఆదివారం విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు. లండన్, డ్యూటోరియం డ్రైడల్ మేకప్ ఆర్థిక సాయంతో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో వయస్సుతో సంభందం లేకుండా అందరికి ఆహ్లాదం కలిగించే మ్యూజిక్, రెయిన్ డ్యాన్స్, హైదరాబాద్ వారిచే తీన్‌మార్ బ్యాండ్‌తో పాటు రెడ్ ఎఫ్ వారి ప్రత్యేక కార్యక్రమాలు స్త్రీ, పురుషులకు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రియా సందీప్, హరి, శ్రీదర్, సందీప్ పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఇనాక్‌కు సన్మానం



తిరుపతి, మార్చి 5ప్రభాతవార్త:

ఎందరో యువతను ఉన్నత స్థానాలకు చేరవేసేలా విద్యాబోధన చేయించడంలో ప్రత్యేకత సంతరించుకున్న ఎస్వీయూ విశ్రాంత ఉపకులపతి ఆచార్య ఇనాక్‌ను ఆదివారం రాయలసీమ రంగస్థలి సంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆచార్య ఇనాక్‌కు ఎస్వీయూ వద్ద రాయలసీమ రంగస్థలి సభ్యులు అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, జీవిఎస్ ప్రసాద్, సుబ్రమణ్యంరెడ్డి, రమేష్ కలసి పుష్పగుచ్ఛంతోస్వాగతం పలికి దుశ్శాలువతో సత్కరించారు.

## ఘనంగా రెడ్ చెర్రీస్ స్కూల్ వార్షికోత్సవం

తిరుపతి (విద్య), మార్చి 5, ప్రభాతవార్త



రెడ్ చెర్రీస్ స్కూల్ 11వ వార్షికోత్సవాన్ని స్థానిక పిఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి రెడ్ చెర్రీస్ స్కూల్ ఎప్పుడు ముందుంటుందని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టరు సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో విలువలతో కూడిన విద్యతో పాటు సృజనాత్మక విద్యను అందించడంలో రెడ్ చెర్రీస్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మజ, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రత్యేక హోదా రాష్ట్రష జెఏసి జాయింట్ సెక్రటరీగా "విరూపాక్షి"

చంద్రగిరి, మార్చి 5 ప్రభాతవార్త:



ప్రత్యేక హోదా రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా అమ్ ఆద్మీ పార్టీ చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ విరూపాక్షి నవీన్ కుమార్ రెడ్డి నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించడమే లక్ష్యంగా రాష్ట్ర జెఏసి కమిటీ ఏర్పాటు అయినట్లు తెలిపారు. ఈ మేరకు విజయవాడలో జరిగిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ సమావేశంలో తనకు జెఏసి జాయింట్ సెక్రటరీగా కమిటీలో స్థానం కల్పించినట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని యువ భవిష్యత్ దృష్ట్యా ప్రత్యేక హోదా కావాలన్నారు. ఇందుకోసం రాజీలేని పోరాటం చేయనున్నట్లు తెలిపారు.

# ఆదుకునే వ్యక్తే కానీ..ఆపదకలిగించేవాడు కాదు ఎంఎల్‌ఏ

### -వైకాపా కాపువిభాగం నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 5 ప్రభాతవార్త

నియోజకవర్గ ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డి ప్రజలను, కార్యకర్తలను, నమ్ముకున్న వారిని ఆదుకునే వారే కానీ, ఎన్నడూ ఆపదకలిగించే వాడు కాదని వైఎస్ఆర్‌సిపి కాపు విభాగం నాయకులు అన్నారు. శనివారం మాజీ వైకాపా పట్టణ అధ్యక్షుడు కొట్టెడి మధుశేఖర్ ఎంఎల్‌ఏను తీవ్రస్థాయిలో విమర్శించడంతో కాపునాయకులు శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసంద ర్భంగా మాజీ కౌన్సిలర్ శరవణ మాట్లాడుతూ కొట్టెడిమధుకి ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూధన్‌రెడ్డిని విమర్శించే స్థాయి లేదన్నారు. కేవలం కాపు సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతోనే ఆయనకు ఆరేళ్ళ పాటు వైసిపి పట్టణా ధ్యక్షుడుగా సేవచేసుకునే భాగ్యం దక్కిందన్నారు. అయితే



మాట్లాడుతూ కొట్టెడికి పట్టణాధ్యక్ష పదవికావాలంటే ఈక్షణమే తాను రాజీనామా చేస్తానన్నారు. అయితే ఎంఎల్‌ఏ కాళ్ళు పట్టుకుని క్షమాపణలు చెప్పాలని సవాల్ చేశారు. కాపులకు అండగా నిలబడిన వ్యక్తి బియ్యపుమధుసూధన్‌రెడ్డి ఒక్కరే అని ఆయన గురించి అవాకులు చవాకులు పేలడం మానాలని హితవుపలికారు. ట్రస్టుబోర్డు మార్పు అంశం పూర్తిగా పార్టీ వ్యక్తిగత నిర్ణయం అని ఒకవేళ మార్చినా సామాజిక న్యాయంలో భాగమేనన్నారు. చింతామణి పాండు మాట్లాడుతూ అసలు కొట్టెడిపై దాడి నిజంగా జరిగిఉంటే పోలీసులు నిందితులును పట్టుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎంఎల్‌ఏ కుటుంబంపై బురదజల్లేందుకు ఇలా తప్పుడు కేసులు పెట్టాడంటూ విమర్శించారు. ప్రజాసేవకే అంకితమైన ఎంఎల్‌ఏ కుటుంబంపై విమర్శలు మానుకోకుంటే కులబహిష్కరణ చేయాల్సి వస్తుందని సెన్నీరుకుప్పంశేఖర్ హెచ్చరించారు. సమావేశంలో సురేష్, సాధన మున్నా, వెంకటేష్‌బాబు, బాలాజీ, హంసామనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల సాధనకే జనసేన



**బుచ్చి మార్చి 5 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ గ్రామంలో ని గిరిజన కాలనీలో జనసైనికులు మల్లికార్జున్ ఆద్వర్యంలో ఆదివారం పల్లెపల్లెకు జనసేన కార్యక్రమాన్ని మండల అధ్యక్షులు దేపూరి మాదవ్, ఉపాధ్యాక్షులు తుమ్మ ప్రసాద్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లి జనసేన పార్టీ గురించి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యలపై చేస్తున్న పోరాటాలు, ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించారు. గ్రామంలోని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలను సంబంధిత అదికారుల దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించనున్నట్లు వారు తెలిపారు. ఈకార్యక్రమంలో బిట్రాసాయి, కమీటి సభ్యులు సుధీర్, సురేష్, వర్ధిసాయి, అనిల్, నాయబ్, జనత్, జనసైనికులు పాల్గోన్నారు.

## విద్యుత్ అధికారుల అసమర్దత... లైన్లు ఆపేసిన ప్రైవేట్ వ్యక్తులు !



**కావలి, మార్చి 5 ప్రభాతవార్త:** కావలి పట్టణం ట్రంకురోడ్డు నమస్కార్ సెంటర్‌లో విద్యుత్ శాఖకు సంబంధం లేని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు కరెంటు స్తంభాలు ఎక్కి లైన్లు అన్ని క్రిందపడేయడంతో దాదాపు ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యుత్ అధికారుల అసమర్దతను, అవినీతిని చాటిచెప్పినట్లయిందని ప్రజలు దుయ్యబడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమీపంలో ప్రైవేట్ వ్యక్తుల కోసం కాంట్రాక్ట్ కుదుర్చుకొని విద్యుత్ శాఖకు సంబంధం లేని ఆరేడు మంది వ్యక్తులు యథేచ్ఛగా విద్యుత్ స్తంభాలు ఎక్కి విద్యుత్ లైన్లు అన్ని క్రిందపడేశారు. నమస్కార్ ప్రాంత ప్రజలు కరెంటు తీసేశారని అడిగితే డిఇకి చెప్పుకోమని ఎదురుదాడికి దిగారు. దీంతో ఎలక్ట్రికల్ డిఇ, ఎడిఇలకు ఫిర్యాదు చేస్తే తాము కరెంటు ఆపలేదని, తెలియదని విచారిస్తామని సమాధానం చెప్పడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతం ప్రజలు అవాక్కయ్యారు. విద్యుత్ అధికారుల పనితీరును దుయ్యబట్టారు. ఆరు గంటల పాటు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో దోమల ఉధృతి ధాటికి తట్టుకోలేక వృద్దులు, పిల్లలు నానా యాతనలు పడ్డారు. ఈ డిఇ, ఎడిఇ అధికారులు ఎఇతో మాట్లాడితే ఆయన కూడా నాకు తెలియదని సమాధానం చెప్పారంట. కావలిలో విద్యుత్ అధికారుల పనితీరు వ్యవస్థ పట్ల ప్రజలు దుయ్యబడుతున్నారు. లోపాయికారికంగా కాంట్రాక్ట్‌లు మాట్లాడుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులకు సమాచారం తెలిపినా చర్యలు చేపట్టలేని దుస్థితిలో వున్నారన్న విమర్శలు ఎదుర్కొంటున్నారు. కావలి విద్యుత్ అధికారుల పనితీరుపై విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ఫిర్యాదుల మేరకు ఎట్టకేలకు రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను కొనసాగించి అధికారులు చేతులు దులుపుకున్నారు. విద్యుత్ శాఖకు తెలియకుండా ప్రైవేట్ వ్యక్తులు స్తంభాలు ఎక్కి వ్యాపారం చేస్తున్నారంటే ఈ అధికారుల లోపాయికారితనంగా అద్దంపట్టినట్లయిందని ప్రజలు విమర్శిస్తున్నారు. కొన్ని ప్రాంతాలలో ఏళ్ల తరబడి కరెంటు బిల్లులు చెల్లించకపోయినా బకాయిలు వసూలు చేయడంలో ఈ అధికారులు మీనమేషాలు లెక్కపెడుతూ విద్యుత్ శాఖకు గండికొడుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## బీజేపీ అభ్యర్దులను గెలిపించండి

**వలేటివారిపాలెం మార్చి 5, ప్రభాతవార్త:** మార్చి 13న జరిగే శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ పట్టభద్రుల అభ్యర్ది సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్ది కుట్టుబోయిన బ్రహ్మానందంలను గెలిపించాలని బీజేపీ నేత పెయ్యల వెంకటరమేష్ యాదవ్ ఓటర్లుకు విజ్ఞప్తిచేశారు. పరిపాలనా సమర్దత ప్రధాని నరేంద్ర మోడీ సారధ్యంలోని బీజేపీకే సాద్యమని ఆయన వివరించారు. పరిపాలనలో రాష్ట్రప్రభుత్వం అన్ని విధాలా విఫలమైందని తత్ఫలితంగా అభివృద్ది కుంటుపడిందన్నారు. బీజేపీ అభ్యర్దులను గెలిపిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. కుల, మత, ప్రాంత, వర్గ, పార్టీలు తదితర ఏ ప్రలోభాలకు లోనుకాకుండా విజ్ఞులైన గ్రాడ్యుయేట్స్, ఉపాధ్యాయులు ఆలోచించి తమ పవిత్రమైన తొలి ప్రాధాన్యత ఓటును బీజేపీ అభ్యర్దులకు వేసి, వేయించి గెలిపించాలని ఆయన సూచించారు.

## ముమ్మరంగా వైసిపి ఎన్నికల ప్రచారం

**కందుకూరు, మార్చి5, ప్రభాతవార్త:** శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా శాసనమండలి ఎన్నికల ప్రచారంసాగుతోంది. ఆదివారం కందుకూరు మండలం కొండముడుసుపాలెంలో జరిగిన ప్రచారంలో ఎంపీపీ సుశీలా మాధవరావు, జడ్పీటీసీ సభ్యురాలు అనసూయమ్మ శ్రీనివాసులు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, వెంకారెడ్డి, వసంతరావులు పాల్గొన్నారు. కందుకూరు పట్టణంలో పార్టీ కార్యదర్శి ఎస్‌కె రఫీ, అబ్దుల్ రహీం, మాజీ కౌన్సిలర్లు, వివిధవార్డుల్లో పర్యటించారు. మండలంలోని కోవూరు పంచాయతీలో సర్పంచ్ మాధవరావు ఆధ్వర్యంలో మండలనాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. మండల నాయకులు జి. వెంకటరావు, రామకృష్ణారెడ్డి, కోటిరెడ్డి, వెంకటరావు, వి. వెంకటేశ్వర్లు, మాలకొండారెడ్డి, కొండూరి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు హాజరైయ్యారు. పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలంటూ ప్రచారం చేశారు.

## యువగళాన్ని మండలిలో వినిపిద్దాం

ముత్తుకూరు, మార్చి5, ప్రభాతవార్త టిడిపి పార్టీ బలపరిచిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించి యువగళాన్ని మండలంలో వినిపించేందుకు పట్టభద్రుల ద్వారా ఓట్లు వేయించి గెలిపించాలని మండల టిడిపి యూత్ ఉపాధ్యక్షుడు రాగాల శివకృష్ణ అన్నారు. ఆదివారం ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పంచాయతీలో రెండవరోజు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ మాజీమంత్రిసోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు కృష్ణపట్నం పంచాయతీలో పట్టుభద్రుల ఓటు కలిగిఉన్న వారి దగ్గరకు వెళ్లి బ్యాలట్ నమూనా పత్రాలు ఇచ్చిటిడిపి అభ్యర్థిగా పోటీ చేస్తున్న కంచర్ల శ్రీకాంత్‌ను గెలిపించాలని అభ్యర్ధించారు. తెలుగుదేశం అధికారంలోకివచ్చిన తర్వాత విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి స్థానిక నాయకులు కోదండరామయ్య, ఏకుళ్ల మురళీబాబు, వావిల్ల వెంకట రమణయ్య, గోడలి మధుస్వామి, పి. రామకృష్ణ, వాకాటి నాగార్జున, మల్లికార్జున, కర్నం అమర్‌నాద్, రాజేష్, వాసు, వీరేపల్లి ఆదిశేషయ్య, కర్నం నాగరాజు, కార్తీక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాంత్ గెలిపించండి

**నెల్లూరు ఫిబ్రవరి 5, ప్రభాతవార్త-వైద్యం** నిరుద్యోగులు సమస్యలు పరిష్కారం కావాలంటే తెలుగుదేశం పార్టీ బలపరిచిన అభ్యర్థి కంచర్ల. శ్రీకాంత్ గెలిపించాల్సిన అవసరం నిరుద్యోగులకు ఎంతైనా ఉందని తెలుగుదేశం పార్టీ మాజీమంత్రి ఆలపాటి. రాజేంద్రప్రసాద్, నెల్లూరు జిల్లా అధ్యక్షుడు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌లు కోరారు. ఆదివారం 27వ డివిజను కొండాయపాళెం రూరల్ పరిధిలోని శివాలయం వద్ద నుంచి మాజీ కార్పొరేటర్ మేకల. నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికల ప్రచారంలో మాజీమంత్రి ఆలపాటి. రాజేంద్రప్రసాద్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్‌అజీజ్‌లు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో దొడ్డపనేని. రాజానాయుడు, మన్నెం. పెంచలనాయుడు, జలదంకి. సుధాకర్, సుబ్రమణ్యం, దారా. మల్లి, నవీన్, మిర్చి. రవి, గోడ. పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల బలోపేతమే లక్ష్యం




**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** సహకారం ద్వారానే మానవ మనుగడ, పురోగతి, ఆర్థికాభివృద్ధి సాధ్యమని భావించి సంఘాల పటిష్టల అనే లక్ష్యాలతో సహకార భారతి ముందుకు సాగుతుందని రాష్ట్ర అధ్యక్షుడు అద్దూరి శ్రీనివాసులు అన్నారు. కోవూరు మండలం లేగుంటపాడులోని ప్రగతి యువకేంద్రం ఆవరణలో ఆదివారం సహకార భారతి రాష్ట్ర ద్వితీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శుద్ధి , వృద్ధి, సంవృద్ధి అనేవే ధ్యేయంగా సహకార భారతి ముందుకు సాగుతుందన్నారు. ప్రదానంగా చేనేత మహిళా గృహ సహకార పారిశ్రామిక అభివృద్ధికి సహకార భారతి ఎలవేళలా కృషి చేస్తుందన్నారు. దీంతో పాటు సహకార భారతి ద్వారా సంఘాలలోని సభ్యులకు, పాలక వర్గానికి ప్రదానంగా సహకార వ్యవస్థ శిక్షణ వారిలో అనేక నైపుణ్యాలను పెంపొందించేలా తగు చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో 2 లక్షల సొసైటీలను పూర్తిస్థాయిలో స్థాపించాలనే ధ్యేయంగా సహకార భారతి ముందుకు సాగుతుందన్నారు. 1979లో ఏర్పాటు చేసిన ఈ సహకార భారతి దేశవ్యాప్తంగా ముందుకు సాగుతుందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. గంగాధరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని రైతు సహకార కేంద్రాలను ప్రత్యేకంగా అభివృద్ధి పరచి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ఎఫ్‌పీవోలను సమిష్టిగా చేసి వారికి కావాల్సిన మార్కెటింగ్, తదితర అంశాలపై శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులు ఉతపత్తి చేసిన పంటలకు ఏయే ప్రాంతాల్లో డిమాండ్ ఉంటుందో తెలుసుకుని ఆయా ప్రాంతాల్లో వాటిని విక్రయించేలా సంబంధిత ఎఫ్‌పీవోలను ప్రోతనసహించడం జరుగుతుందన్నారు. సహకార వ్యవస్థ ద్వారానే సంఘాలను మరింత బలోపేతం చేసి మేకిన్ ఇండియా.. మేడిన్ ఇండియా అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా సహకార సొసైటీలను ప్రోత్సహించి అవి పూర్తిస్తాయిలో బలోపేతం దిశగా ముందుకు సాగడం జరుగుతుందన్నారు. తెలంగాణ సహకార భారతి అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి తెలియజేశారు. నాబార్డు డీడీఎం రవిసింగ్ మాట్లాడుతూ ఇపనపటికే నాబార్డు ద్వారా అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఎఫ్‌పీవోలకు తమవంతుగా పూర్తిస్థాయిగా ప్రోతానసహాన్ని అందిస్తున్నామన్నారు. వీటితో పాటు సబ్సిడీతో రుణాలు, అందించడమే కాకుండా అభివృద్ధి పథంలో పయనిస్తున్న ఎఫ్‌పీవోలకు నాబార్డు తోడ్పాటు ఎల్లవేళలా ఉంటుందన్నారు. వీటితో పాటు వ్యవసాయ ఉద్యావన శాఖలో వస్తున్న నూతన మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక పద్ధతులపై రైతుల్లో అవగాహన పెంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. లేగుంటపాడు లోని ప్రగతి యువ కేంద్రం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మహిళా బ్యాంక్ సీఈవో ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం అభివృద్ధి పథంలో పయనిస్తున్న పొదుపు గ్రూపులకు ఎటువంటి తనఖా లేకుండా 20 లక్షల వరకు బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయన్నారు. క్రమం తప్పకుండా బ్యాంకులకు తిరిగి రుణాలు చెల్లించే గ్రూపులకు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయన్నారు. ప్రగతి యువ కేంద్రం సీఈవో భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సహకార బారతి ద్వారా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో తెలంగాణ సంఘటనా మంత్రి ప్రవీణ్‌కుమార్, సహకార భారతి జాతి ఉపాధ్యాక్షుడు కృష్ణారెడ్డి, మంగుళూరు క్షేత్ర సంఘటనా ప్రముఖ్ సతీష్‌చంద్ర, ఎన్‌సీసీ సభ్యులు టి. జానకిదేవి, తదితరులు ప్రసంగించారు.

## పట్టభద్రులారా ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచించండి



**కోవూరు, మార్చి 5 ప్రభాతవార్త :** జిల్లాలో మార్చి 13న జరగనున్న పట్టభద్రుల ఎన్నికల్లో ఓటు వేసే ముందు పట్టభద్రులు ఒక సారి ఆలోచించి వేయాలని జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. కోవూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలోని చంద్రబాబు పాలన ఎలా ఉండేది, నేడు జగన్‌మోహన్‌రెడ్డి పాలన చెలా ఉంది అనేది ఓటు వేసే ముందు ఆలోచించాలన్నారు. నిరుద్యోగులను , ఉద్యోగులను, విశ్రాంత ఉద్యోగులను సైతం ఈ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. తాము అధికారంలోని వస్తే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 2,40,000 ఉద్యోగాలు భర్తీ చేస్తామనిచెప్పి ఆ విషయాన్ని మర్చిపోయారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి ఇస్తుంటే జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని కూడా నిలిపివేశారన్నారు. గత ప్రభుత్వంలో విశ్రాంత ఉద్యోగులకు క్రమం తప్పకుండా ప్రతి నెల 1వ తేదీన పింఛన్ పడుతుంటే ప్రస్తుత ప్రభుత్వంలో 15వ తేది వరకు వారి ఖాతాలో పడడం లేదన్నారు. ప్రస్తుతం పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి నిరుద్యోగులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఎక్కువగా ఓటర్లుగా ఉన్నారని, వీరంతా పూర్తిగా ఆలోచించి ఓటు వేయాలని తెలియజేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేస్తున్న కె. శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవికుమార్, విజయ్, సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణారెడ్డి, గోపాల్, ఖలీల్, లక్ష్మయ్య, సుబ్బారెడ్డి, వేణు, రవి, భగవాన్, వెంకటేష్‌లు ఉన్నారు.

## రైల్వే ఉద్యోగి ఆత్మహత్య



**బిట్రగుంట, మార్చి 5 ప్రభాతవార్త** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని 151 ఎల్‌సి గేటులో పనిచేస్తున్న వెంకట శ్రీకాంత్(32) అప్పుల బాధతో గుర్తు తెలియని రైలు క్రింద పడి ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు జిఆర్‌పి ఎస్‌ఐ అరుణకుమారి తెలిపారు. మృతదేహం 217/15 అప్‌లైన్‌లో గుర్తించబడిందని మృతుడి స్వగ్రామం వింజమూరు మండలం చంద్రపడియ గ్రామ వాస్తవ్యుడు అని కావలిలో నివాసం వుంటున్నాడని తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు. కాగా ఈ నెల 2వ తేది ఒక రైల్వే ఉద్యోగి కూడా అప్పుల పాలై సింహపురి ఎక్స్‌ప్రెస్ క్రింద ఆత్మహత్య చేసుకోవడంతో వరుస ఆత్మహత్యలతో రైల్వే ఉద్యోగుల్లో కలవరం మొదలైంది.

## యాదవ్‌భవన్ ఆవిర్బవాన్ని జయప్రదం చేయండి



పొదలకూరు మార్చి 5 ప్రభాతవార్త ఈనెల 12 వతేది నెల్లూరు నగరంలోని కొండాయపాళెం గేటు సమీపంలోని జరిగే జిల్లా యాదవ్‌భవన్ భూమి పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదవ్‌భవన నిర్మాణ ఆహ్వాన కమీటి ప్రెసిడెంట్ బొమ్మి నాగకిషోర్‌యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ఒక కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గోని మాట్లాడారు. యాదవ్ భవన పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు బీదామస్తాన్‌రావు ,మాజీ మంత్రి పోలుబోయిన అనీల్‌కుమార్‌యాదవ్, జాతీయ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి బీదారవిచంద్ర, ఆల్పహెచరీస్ చైర్మన్ దూడల సుదకార్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని అన్నారు. యాదవ్ భవన్ నిర్మాణం పూర్తి అయితే యాదవ్ విద్యార్థులకు అత్యాదునిక వసతులతో 70 హాస్టల్ గదులు అన్ని వర్గాల వారికి అనుకూలంగా కళ్యాణ మండపం మిని ఫంక్షన్‌హాల్ వివిధ యాదవ్‌సంఘం కార్యాలయాలలు గదులు అందుబాటులో ఉంటాయని అన్నారు. తద్వారా యాదవ్‌లు వారి పిల్లలు సామాజిక విద్యలో రాణించడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ రమణయ్య, రావి రమణయ్య, మయూరి శ్యాంప్రసాద్, పడ్డాల వేమయ్య, వేడిచర్ల రమణయ్య, శ్రీహరి, వార్డన్ లక్ష్మయ్య, కాకులూరు చిన్నా తదితరులు పాల్గోన్నారు.

## దివ్యాంగుల జాతీయ నేత మండవను పరామర్శించిన టిడిపి నేతలు



కావలి, మార్చి 5 ప్రభాతవార్త దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి, ముసునూరు వికలాంగుల కాలనీ అధ్యక్షులు మండవ వెంకట్రావును టిడిపి నేతలు పరామర్శించారు. తెలుగుదేశం పార్టీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు, కావలి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు వర్ల కుమార్‌రాజాలు ఆదివారం మండవ నివాసానికి వెళ్లి పరామర్శించి అండగా వుంటామని హామీ ఇచ్చారు. ముసునూరు వికలాంగుల కాలనీలో వైసిపి నేతలు జొరబడి అక్రమంగా నిర్మాణాలు చేస్తున్నారని అధికారులు అడ్డుకోకపోవడంపై ఆయన తహశీల్దార్ కార్యాలయం వద్ద పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం తెలిసిందే. ఈ విషయంపై టిడిపి నేతలు మండవ నివాసానికి వెళ్లి మాట్లాడి ధైర్యాన్ని ఇచ్చారు.

## ఆవుల దుర్గారావు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



కావలి రూరల్, మార్చి 5 ప్రభాతవార్త కావలి రూరల్ మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రం వైసిపి నాయకులు ఆవుల దుర్గారావు తండ్రి ఆవుల కృష్ణయ్య ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో కావలి ఎయంసి చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, వైసిపి నాయకులు కుందుర్తి కామయ్య, మండలి కృష్ణారావు, కోమరి రాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద బాలుడి వైద్య ఖర్చులకు బెస్ట్ వాకర్స్ ఆర్థిక సహాయం



కావలి, మార్చి 5 ప్రభాతవార్త కావలి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన కామంచి వీరకృష్ణ ఆరోగ్యం బాగలేకపోవడంతో కావలి బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 10 వేల రూపాయలు నగదును అందజేశారు. కార్యక్రమంలో బెస్ట్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, విశ్రాంత ఎస్ఐ శేషయ్య, ట్రెటరర్ నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, గౌరవాధ్యక్షులు మంద వెంకటేశ్వర్లు, బుజ్జి, సత్యానందం, కృష్ణ, శ్రీనివాసులు, గోపాల్, రమేష్, హరి, పుంకు కృష్ణ, క్లాత్ కృష్ణ, భాస్కర్‌నాయుడు, రోహిణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల్లో కావలికి రాష్ట్ర స్థాయి గుర్తింపు తేవాలి

**కావలి, మార్చి 5 ప్రభాతవార్త** యువత, విద్యార్థులు క్రీడల్లో మక్కువ పెంచుకొని ప్రావీణ్యాన్ని చాటిచెప్పి కావలికి రాష్ట్ర స్థాయి గుర్తింపు తేవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి కోరారు. కావలి జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన క్రికెట్ ఆడి అందర్ని ఉత్తేజపరిచారు. ఈ టోర్నమెంట్‌కు 25 వేల రూపాయల ప్రైజ్ మనీని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. కావలి మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు ప్రైజ్ మనీగా కావలి వైసిపి నేత కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి పది వేల రూపాయలు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొని ప్రతిభను చాటిచెప్పాలన్నారు. క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కుందుర్తి కామయ్య, అయ్యావారు కృష్ణారెడ్డి, షాహుల్ హమీద్, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని అందించండి

## మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ - గూడూరులో మాంసం దుకాణాలపై కమిషనర్ దాడులు

గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని మాంసం దుకాణాలపై మున్సిపల్ కమిషనర్ తోట సాయినాథ్ ఆకస్మిక దాడులు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం పర్యవేక్షణలో భాగంగా పర్యటిస్తుండగా ఒక మాంసం దుకాణాన్ని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆ దుకాణంలో తనిఖీలు చేయగా, బయట పొట్టేలు మాంసం తగిలించి ఉందని, లోపల తనిఖీ చేయగా, చర్మం తీసిన గొర్రె మాంసం నురగలు పొంగుతూ చీమలు పట్టి ఉందని తెలిపారు. అందులో సగ భాగాన్ని బయట చాలావరకు మాంసం ప్రియులకు విక్రయించారని తెలిపారు. ఇలాంటి పరిశుభ్రత లేని, నాణ్యత లేని మాంసాన్ని విక్రయించిన దుకాణాన్ని సీజ్ చేశామన్నారు. మరో ఐదు దుకాణాలను తనిఖీ చేయగా, రెండు



మూడురోజుల క్రితం మాంసాన్ని ఫ్రీజర్లలో ఉంచి అప్పుడే బయటకు తీసి మాంసం బయటకు విక్రయిస్తున్నారని తెలిపారు. మాంసంతో పాటు ఐస్ గడ్డలు కూడా పక్కనే ఉండటంతో దునాణదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మళ్లీ ఇలా జరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయితే ఓ దుకాణ యజమాని ఈ మాంసం పారేసేందుకు ఫ్రీజర్లలో ఉంచామని చెప్పడంతో దాన్ని మున్సిపల్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు. ఇదిలావుంటే ఓ దుకాణ యజమాని మాత్రం ఆ మాంసాన్ని దుకాణంలో వినియోగించేందుకే అక్కడ ఉంచినట్లు చెప్పడం దారుణమన్నారు. నిబంధనల ప్రకారం దుకాణాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఎవరెవరు ఎంత మాంసం విక్రయిస్తున్నారో ఖచ్చితంగా తెలియజేయాలన్నారు. లేనిపక్షంలో లైసెన్సులు రద్దు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు. త్వరలోనే గూడూరులో మాంసం మార్కెట్ ఏర్పాటు చేసి ఆదివారం విక్రయించబోయే మాంసం గురించి దుకాణాల యజమానులు ముందుగానే తెలియజేసేలా ఆదేశాలు ఇస్తామన్నారు.

# అత్యద్భుతంగా లక్షమోదక లక్ష్మీగణపతి హవనము

-శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి



కాణిపాకం, మార్చి 5 ప్రభాతవార్త:

సత్యప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీస్వయంభు శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 3 నుండి 5 వరకు ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న లక్షమోదక లక్ష్మీ గణపతి హవనము మహాయజ్ఞం కార్యక్రమం అత్యద్భుతంగా జరిగిందని విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి అన్నారు. లోక క్షేమం కోరుతూ దేశం సుభిక్షంగా వుండాలని రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా కాణిపాకం ఆలయంలో లక్షమోదక లక్ష్మీ గణపతి హవనమును విశాఖ శ్రీశారదా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి, పీఠం ఉత్తరాధికారులు శ్రీశ్రీశ్రీ స్వాత్మానంద్రేంద్ర సరస్వతి స్వాముల వారి పర్యవేక్షణలో లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము కార్యక్రమంను నిర్వహించిన విషయం విదితమే. ఈమేరకు చివరిరోజు మహాపూర్ణాహుతి అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల మొక్కు కోరికలు నెరవేరే విధంగా భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా ఆలయ అధికారులు, సిబ్బంది చాలా తొందరగా అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. అలాగే స్వర్ణరథం నిర్మాణం పూర్తి చేసి స్వామివారికి అందుబాటులోకి తీసుకువచ్చి ఊరేగిస్తున్నారన్నారు. దీనితో పాటు ఆలయ పునర్నిర్మాణ పనులను అతి తక్కువ వ్యవధిలో పూర్తి చేసి మహాకుంభాభిషేకం నిర్వహించి స్వామివారి పరిపూర్ణం చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము కార్యక్రమంను అత్యద్భుతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఈపూజా కార్యక్రమాలను వైదికంగా బ్రాహ్మయణులు శాస్త్రోక్తంగా నిర్వహించారని స్వరూపా నంద్రేంద్ర సరస్వతి మహాస్వామి తెలిపారు. ఈవిలేకరుల సమావేశంలో స్థానిక ఎమ్మెల్యేఎంఎస్.,బాబు, ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

## "బాలసంస్కార"లో చిన్నారి యేషిత ప్రతిభ అమోఘం

తిరుపతి, మార్చి 5ప్రభాతవార్త:



నేటి ఆధునిక సమాజంలో చిన్నవయస్సు నుంచే విద్యార్థులను ఆధ్యాత్మిక,సనాతన హిందూ ధర్మంపై అవగాహన కలిగేలా తిరుపతిలోని రామకృష్ణమఠం నిర్వహిస్తున్న "బాలసంస్కార"కార్యక్రమంలో పలు అంశాలపై ప్రతిభ కనబరిచిన చిన్నారి యేషితకు నిర్వాహకులు బహుమతిప్రదానం చేశారు. తిరుపతి ఇస్కాన్‌రోడ్డులోని రామ కృష్ణ మఠం ఆశ్రమంలో ఆదివారం వివిధ కేటగిరీల్లో విద్యార్థినీవిద్యార్థులకు పోటీలు నిర్వహించారు. వేదపఠనం, యోగా, భజనలు, స్టోరీటెల్లింగ్, చాటింగ్ విభాగాల్లో ప్రభుత్వ, మున్సిపల్ కార్పొరేషన్, టిటిడి,ప్రైవేటు విద్యాసంస్థల్లో చదువుతున్న నగర విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జపము, భజనలు, విష్ణుసహస్రనామపారాయణం నిర్వహించారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పావులూరి ఏషిత, జ్ఞానప్రసూన,నీరజ, హరదీప్, లహరి, శారద, మనోజ్ ,ప్రసన్నలక్ష్మీలకు ఆశ్రమం సిబ్బంది కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, జీఎస్ ప్రసాద్ ఆధ్యాత్మిక గ్రంధాలు అందజేశారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



కుప్పం,మార్చి5 ప్రభాతవార్త

స్థానిక హెచ్‌పి రోడ్, గుడుపల్లె క్రాస్ ప్రాంతంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 100 రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో సభ్యులు కృష్ణ, నాగరాజు, శరవణ, మంజునాథ్‌శెట్టి, కృష్ణన్న, శివ, చరణ్, ఇందిర, జలజాక్షి, వెంకటలక్ష్మీ, యశస్విని తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్ఎంయు రామ్మోహన్‌రావు వర్ధంతి



కుప్పంరూరల్, మార్చి 5 ప్రభాతవార్త

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూని యన్ వ్యవస్థా పకులు, రాజీవ్ రత్న అవార్డు గ్రహీత దివంగత రామ్మోహన్‌రావు 18వ వర్ధంతిని స్థానిక ఆర్టీసీ డిపో ఎన్ఎంయుఎ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వేలు అధ్వర్యంలో నిర్వహిం చా రు. ఈసంద ర్భంగా డిపో కార్య దర్శి జయపాల్ మాట్లాడుతూ రామ్మోహన్‌రావు సేవలను కొనియాడారు. ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్ల రద్దుకు కృషి చేశారన్నారు. ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో 13సార్లు సంఘగెలుపుకు ఆయన చూపిన మార్గాలు దోహదపడ్డాయన్నారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు మునస్వామి, సంఘ నేతలు శ్రీనివాసులు, బొట్టుమణి, రహంతుల్లా, దిలీప్,మునెప్ప,భాస్కర్,కుమార్,ప్రసాద్,జయగోపి,రమణ, ప్రసన్న, ఏలుమలై తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

పెద్దపంజాణి మార్చి 5 ప్రభాతవార్త :

పెద్దపంజాణి మండల మహాత్మజ్యోతీరావుపూలే గురుకుల పాఠశాల 2023-2024 వ సంవత్సరం 5వ తరగతి ప్రవేశానికి దరకాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ ఎ.జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసక్తిగల వారు మార్చి 5తేదీ-ఏప్రిల్ 4వతేదీ లోపు ఆన్‌లైన్లో దరకాస్తు చేసుకోవాలని సూచించారు.దరకాస్తు చేసుకునే బీసీ,ఈబీసీ విద్యార్థులకు 11 సంవత్సరాలు,ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు 13సంవత్సరాల వయసు కలగి ఉండాలన్నారు. వీరికి ఏఎంఆర్ పద్ధతిలో 50 మార్కులకు పరీక్ష తెలుగు,ఆంగ్ల మాధ్యమంలో ఉంటుందని తెలిపారు.అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.తదితర వివరాలకు గురుకుల పాఠశాల ఫోన్ నెంబర్:9515764814కు ఉదయం 9-5 గంటల మధ్యలో ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

## డా॥ పసుపులేటిని కలసిన జనసైనికులు

శాంతిపురం, మార్చి 5 ప్రభాతవార్త



ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు డా॥ పసుపులేటి హరిప్రసాద్‌ను ఆదివారం కుప్పం నియోజకవర్గ జనసేన నేతలు తిరుపతిలో కలిశారు. కుప్పంలో చేపడుతున్న పార్టీ సభ్యత్వం, మార్చి 14న జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం గురించి చర్చించారు. కార్యక్రమంలో జనసేన నేతలు వామనమూర్తి, రామూర్తి, వేణు, మునెప్ప, నవీన్, కిషోర్, అమీర్, ప్రవీణ్, భాస్కర్, మధు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో పలువురు ప్రముఖులు

కాణిపాకం, మార్చి 5 ప్రభాతవార్త:

సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న లక్ష మోదక లక్ష్మీ గణపతి హవనము కార్యక్రమంలో పాల్గొనేందుక విచ్చేసిన చిత్తూరు, తిరుపతి ఎంపీలు రెడ్డెప్ప, గురుమూర్తి, పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు ఎమ్మెస్ బాబు, ఆరణి శ్రీనివాసులు, శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ అంజూరి తారక శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేదమండపంలో వేదాశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను,చిత్రపటాలను అందజేశారు. ఈకార్యమ్రంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెం డెట్‌లు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి లతో పాటు పలువురు వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## నేడు ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి పూజ

వెదురుకుప్పం, మార్చి 5 ప్రభాతవార్త :

మండల కేంద్రం సమీపంలోని చవటగుంటలో వేలసిన ఆవుదేవర నందీశ్వరస్వామి ఆలయంలో ఘ నంగా సోమవారం పౌర్ణమి పూజ నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం స్వామి అమ్మవార్లకు సుప్రభాత సేవ, వివిధ అభిషేకాలు నిర్వహించి పూజలు చేపట్ట దం జరుగు తుందన్నారు.

## గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

సూళ్లూరుపేట, మార్చి 5 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీబాలయోగి గురుకుల పాఠశాలను హైకోర్టు ఆదేశాల మేరకు ఆదివారం ఎడిఎం అనూష, పిడిఎం ఎస్.అనిల్‌కుమార్‌లు ఆక స్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కలిసి గురుకుల పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. ఆహారం విషయంలో సక్రమంగా మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగారు. టాయిలెట్స్, మంచినీటి సరఫరా, వసతి గదులను పరిశీలించారు. తెలంగాణలోని గురుకుల పాఠశాలల్లో చోటుచేసుకున్న ఉదంతాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలను సీనియర్ జడ్జిల బృందం ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు.సీనియర్ అద్వకేట్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# టిడిపి గుడారం ఎత్తే విధంగా కార్యకర్తలు,నాయకులు పనిచేయాలి

-నియోజకవర్గ సమన్వయ కర్త రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి మార్చి5 ప్రభాతవార్త

2024 సంవత్సరంలో జరుగబోవు ఎన్నికల్లో టిడిపి గుడారం ఎత్తే విధంగా పార్టి నాయకులు,కార్యకర్తలు పనిచేయాలని వైసిపి నియోజవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆదివారం దక్కిలిమండలానికి పలువురు సర్పంచులు,సొసైటి అధ్యక్షులు, ఎంపిటిఈలు రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ దక్కిలి మండలంకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని ఆగుర్తింపును వైసిపికి మంచి మెజారిటీ తెప్పించి నిలపెట్టాలని తెలిపారు.వైసిపి కార్యకర్తలు,నాయకులు దెబ్బకు టిడిపి పారిపోవాలని తెలిపారు. 2024 స ంవత్సరంలో మరలా వైసిపినే అధికారంలోకి వస్తుందన్నారు. ఆయన



మాట్లాడుతూ 175 నియోజవర్గాల్లో వైసిపి విజయం సాధిస్తుందన్నారు.పేదల సంక్షేమమే ధ్యేయంగా సిఎం జగన్ మోహన్‌రెడ్డి పరిపాల సాగిస్తున్నట్లు తెలిపారు. సిఎం అమలు చేస్తున్న సంక్షేమ పదకాలు ఏరాష్ట్రంలో అమలు కావడం లేదన్నారు,వైసిపి గెలుపు కోసం అందరు కలిసి కట్టుగా కృషిచేయాలన్నారు.జిల్లాలోని అన్నినియోజకవర్గాలో వైసిపి అభ్యరులను భారిమెజారిటీతో గెలిపించు కోవాలని తెలిపారు. ఎన్నికల కోడ్ అయిన తర్వాత గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తానని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరిస్తానని తెలిపారు.ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నార,.

## వేమ హైస్కూల్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరం

నాయుడుపేట, మార్చి 5 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని వేమ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్, కోగిలి జయరామిరెడ్డి ఛారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆసు పత్రి వైద్యుల సహకారంతో వైద్యశిబిరం నిర్వహించినట్లు రోటరీ అధ్య క్షులు సోమశేఖర్ తెలియ జేశారు. ఈ వైద్యశిబిరాన్ని కంటి వైద్యం కోసం ప్రజలు అధిక సంఖ్యలు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో కోగిలి జయరామిరెడ్డి ఛారిటబుల్ సొసైటీ సభ్యులు కోగిలి సురేష్‌రెడ్డి, క్యాంప్ ఛైర్మన్ గోపీనాథ్, కార్యదర్శి ఎన్.రామ్మోహన్, కృష్ణారెడ్డి, రాజేష్, వేమ హైస్కూల్ కరస్పాండెంట్ వేణుగోపాల్, అరవింద కంటి ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

## నేడు పోలీస్ స్పందన

చిత్తూరు, మార్చి 5 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పాత చిత్తూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం జరుగనుంది. ఈ కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజలు హాజరై తమ సమస్యలను ఎస్పీ రిశాంత్‌రెడ్డి దృష్టికి తీసుకువస్తే వాటిని ఆయన పరిశీలించి పరిష్కరిం చడానికి చర్యలు తీసుకోనున్నారు.

## యానాదిపాళెంలో వివాహిత ఆత్మహత్య

చౌడేపల్లి, మార్చి 5 ప్రభాతవార్త



కుటుంబంలో ఏర్పడ్డ కలహాల మూలంగా ఓ వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన చౌడేపల్లిలో చోటు చేసుకొంది. ఎస్ఐ రవికుమార్ కథనం మేరకు...మండలంలోని దిగువపల్లి పంచాయతీ బోయకొండ యానాదిపాళెంకు చెందిన బాలాజీ భార్య యర్రమ్మ(32) కూలీపనులు చేసుకొంటూ జీవిస్తోంది. భార్యభర్తల మధ్య ఏర్పడ్డ గొడవల మూలంగా యర్రమ్మ ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పో స్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

## జోరుగా మట్టి అక్రమ రవాణా

పాలసముద్రం, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం ఆముదాల పంచాయతీలో మట్టి అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. క్షేత్ర స్థాయి రెవెన్యూ అధికారులను ప్రసన్నం చేసుకొని కొంతమంది వ్యక్తులు అక్రమంగా మట్టిని తరలించి జేబులు నింపుకొంటున్నారు. క్షేత్ర స్థాయి అధికారులు సైతం ఇక్కడి మట్టి అక్రమ రవాణాను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్ళకపోవడంతో వారు ఏమి ఎరుగనట్లే మిన్నకుండి పోతున్నారు. సెలవు రోజైన ఆదివారం సైతం స్థానికంగా వున్న కొంతమంది వ్యక్తులు ఆముదాల గ్రామ పరిసరాల నుండి మట్టి అక్రమ రవాణా చేస్తూ ఓ ట్రాక్టర్ 'ప్రభాతవార్త'కు చిక్కింది. ఈ విషయంపై 'ప్రభాతవార్త' తహసిల్దారు బాబును వివరణ కోరితే అలాంటి విషయం ఏమి తన దృష్టికి రాలేదని పేర్కొన్నారు.

## గ్రామాలకు వీఆర్వోలు పరుగులు

### ఎమ్మెల్సీ ఓటరు స్లిప్పులు పంపిణీ

వార్త ప్రభావం

కుప్పం, మార్చి 5 ప్రభాతవార్త

కుప్పం నియోజకవర్గంలోని గ్రామ రెవెన్యూ అధికారులు ఆదివారం గ్రామాలకు పరుగులు తీశారు. ఆదివారం 'వార్త'లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు స్లిప్పుల పంపిణీలో నిర్లక్ష్యం అనే కథనం వెలువడిన విషయం విదితమే. దీనిపై స్పందించిన జిల్లా ఉన్నతాధికారులు రెవెన్యూ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో కుప్పం, శాంతిపురం, గుడుపల్లె, రామకుప్పం మండలాల్లో ఉన్న పలువురు వీఆర్వోలు, సర్వేయర్లు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు స్లిప్పులను నేరుగా ఓటర్లకు అందించేందుకు పరుగులు తీశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశారు. ఓటర్ల బాధలపై కథనం ప్రచురించిన 'వార్త'కు పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

## నవోదయ మోడల్ పరీక్ష రాసిన విద్యార్థులు

గూడూరు, మార్చి 5 ప్రభాతవార్త



గూడూరు రెండో పట్టణ పరిధిలోని శ్రీస్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూలులో నవోదయ మోడర్ పరీక్ష-2 ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు వందమందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు కరస్పాండెంట్ నవకోటి నాయుడు తెలిపారు. నవోదయ మాదిరి పరీక్ష పిల్లలకు ఫైనల్ నవోదయ ప్రవేశ పరీక్ష రాయడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, ఈ పరీక్ష పిల్లలకు విజయవంతంగా రాశారని విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూలు కరస్పాండెంట్ పి.నవకోటినాయుడు, అకడమిక్ డీన్ సునీల్, అకడమిక్ కోఆర్డినేటర్ హరికృష్ణ, స్కూలు ప్రైమరీ ఇన్‌ఛార్జ్ ఎన్.సాయి, సింధు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశానికి ఆహ్వానం

దొరవారిసత్రం, మార్చి 5 ప్రభాతవార్త

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన విద్యార్థులు సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏప్రిల్ 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి 12 వరకు 5వ తరగతి, అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు పరీక్ష జరగనుంది. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీజీపీసెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ను చూడవచ్చని సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యం

పెద్దపంజాణి మార్చి 5 ప్రభాతవార్త :



గ్రామీణప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యనుభోదించి వారికి ఉన్నతస్థాయి ఉద్యోగాలు లభించేలా చేయడమే తమ లక్ష్యమని మదర్‌థెరిసా(సీబీఎస్ఈ) పాఠశాల కరస్పాండెట్ ఎం.రవీంద్రబాబు పేర్కొన్నారు. పాఠశాల ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన తిరుపతి ఎడిఫై స్కూల్ కరస్పాండెంట్ ప్రణీత్ మాట్లాడుతూ ప్రతి పాఠశాల పాఠ్యాం శాలను విద్యార్థులకు నేర్పిస్తుందని అయితే మదర్‌థెరిసా పాఠశాలలో విద్యతోపాటు విద్యార్థులకు శారీరక,మానసికవికాసం కలిగించేందుకు పాఠ్యాంశేతర కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతంలో మదర్‌థెరిసా పాఠశాలను సెంట్రల్ సిలబస్‌తో నిర్వహిస్తున్న కరస్పాండెట్‌ను ఆయన అభినందించారు.విద్యార్థుల తల్లిదండ్రులుకూడా తమ పిల్లల చదువులపట్ల దృష్టిసారించి క్రమశిక్ష ణలోనడుచుకునే విధంగా తగుచర్యలు తీసుకోవాలన్నారు. కరస్పాండెంట్ రవీంద్రబాబు మాట్లాడుతూ తక్కువ ఫీజులతోనే తమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2022-2023 సంవత్సరంలో ఉత్తమ ప్రతిభచూపిన విద్యార్థినివిద్యార్థులకు బహుమతులు అందించారు.ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన తేజల్‌ను ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు చేసిన సంగీత,సాహిత్య,సాంస్కృతిక కార్యక్రమాలు యాంకర్ శ్రావని ఆహు తులను ఎంతగానో అలరించాయి.ఈ కార్యక్రమంలో ఛైర్మన్ సునీల్,డైరక్టర్ శ్రేయ,పాఠశాల డీన్ డాక్టర్ వై.మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డేవిడ్,ఉపాధ్యాయినీఉపాధ్యాయులు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## గురుకులంలో ప్రవేశాలకు వేళాయె

కోట, మారి 5 ప్రభాతవార్త

పేద, మధ్యతరగతి, అల్పాదాయ వర్గాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థులు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరేందుకు దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. కార్పొరేట్ తరహాలో 2023-24 సంవత్సరంలో ప్రవేశాలకు గాను ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం కోరింది. ఒక్కసారి సీటు సాధిస్తే వసతితో పాటు ఇంటర్మీడియట్ వరకు ఉచితంగా చదువుకోవచ్చు. ఆంగ్ల మాధ్యమంలో బోధనతో పాటు నీట్, ఐఐటీలో ఉచితంగా శిక్షణ కూడా ఇస్తారు. విద్యార్థులు ఏప్రిల్ 3న జరిగే కామన్ టాలెంట్ ఎంట్రెన్స్‌లో ప్రతిభ చూపి ప్రవేశాలు పొందవచ్చు.

## ప్రభుత్వ భూమి కబ్జా

పాలసముద్రం, మార్చి 5 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ పరిధి లో 2 ఎకరాల ప్రభుత్వ భూమిని తమిళనాడుకు చెందిన ఓ ప్రభుత్వ అధికారి కబ్జా చేశాడు. వనదుర్గాపురం పంచాయతీ పరిధిలో రెవెన్యూ అధికారులు ఇటీవల కాలంలో జర్నలిస్టు లకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ఈ స్థలాలకు సమీ పంలో కొంత ప్రభుత్వ భూమి వుండటంతో ఆ భూమిని తమిళనాడుకు చెందిన వ్యక్తి ఆక్రమిం చుకొన్నాడు. భూమిని ఆక్రమించుకొన్న వ్యక్తి బహిరంగంగా భూమిని చదును చేసే కార్యక్రమం చేపట్ట డంతో ప్రారంభంలో ఆ భూమి అతనిదేనని గ్రామస్తులు భావించారు. అయితే ఇటీవల ఆ భూమిపై అను మానం రావడంతో నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఎపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గురుప్రసాద్ ఆరా తీశారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అని తేలడంతో ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి భూమి కబ్జాకు పాల్పడిన వ్యక్తి నుండి భూమిని స్వాధీనం చేసుకోవాలని ఆయన రెవెన్యూ అధికారులను కోరారు.